

మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు

# పేదల గూడును చెదరగొడ్తారా..?

- మహబూబ్‌నగర్‌లో కూల్చివేసిన ఇండ్ల బాధితులకు క్షమాపణ చెప్పాలి
- 'పాలమూరు' ఎత్తిపోతలపై వివక్ష ఎందుకు..?
- మాజీ సీఎం కేసీఆర్‌కు పేరొస్తదని ఆపుతుండ్రా..?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సూటిప్రశ్న

నాగర్‌కర్నూల్ (నమస్తే తెలంగాణ)/తిమ్మాజిపేట, సెప్టెంబర్ 14 : 'పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్న గూడును చెదరగొడ్తావా..? రేవంత్‌రెడ్డి.. పాలమూరు బిడ్డను అంటూనే.. పేదల ఇండ్లపైకి బుల్డోజర్ పంపి వారి పొట్ట కొట్టావు.. ఇండ్లను కూల్చడానికే నీవు ముఖ్యమంత్రివి అయ్యావా'..? అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నేరెళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌త.. పేదలంటే నీకు ఎందకంతా అలుస న్నారు. సొంత జిల్లా అని చెప్పుకుంటూనే మహబూబ్‌నగర్‌లోని ఆదర్శనగర్‌లో 75 మంది దళితులు, పేదల ఇండ్లను కూల్చివేయించారని మండిపడ్డారు. 17 ఏండ్ల కిందట నాటి కాంగ్రెస్ హయాంలో వైఎస్సార్ హయాంలో పేదలకు స్థలాలు ఇచ్చారని తెలిపారు. ఎన్నో ఆశలతో కట్టుకున్న ఇండ్లు కూలి ఎండకు.. వానకు బాధితులు ఎండుతూ.. తడుస్తుంటే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారికి చేయూతనిచ్చారని తెలిపారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా.. దయ లేకుండా.. ఏ కారణంతో ఇండ్లు కూలగొడ్తున్నారో తెలియజేయకుండా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా చెంపలేసుకొని ఇండ్ల బాధితులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలపై ప్రేమ ఉంటే కేసీఆర్ ప్రభుత్వంలో పాలమూరులో 4 వేల డబుల్‌బెడ్రూం ఇండ్లు నిర్మించామని, అందులో ఇంకా 300 ఇండ్లు ఖాళీగా ఉన్నాయని, వాటిలో కొన్ని బాధితులకు కేటాయించాలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానందగౌడ్, సంజయ్, అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, బిగ్గాల గణేశ్‌గుప్తా, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### త్వరలో 'పాలమూరు' సందర్శన : కేటీఆర్

సీఎం రేవంత్.. మీకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అంటే పట్టదా..? అంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో దాదాపు 90 నుంచి 95 శాతం పనులు పూర్తి చేస్తే.. కాంగ్రెస్ వచ్చిన పది నెలల్లో పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పనులను పూర్తి చేసి సాగునీళ్లు పారిస్తే ప్రతి నీటి చుక్కలో కేసీఆర్‌ను రైతులు తలుచుకుంటారని, ఆయనకే మంచి పేరొస్తదనే వివక్ష చూపుతున్నారన్నారు. ఈ ఎత్తిపోతలపై చిత్తశుద్ధిని తెలియజేస్తామని చెప్పారు. 95 శాతం పనుల పూర్తయినట్లు ప్రజలకు వివరించేందుకు మేడిగడ్డ తరహాలో రెండ్రోజుల పాటు సందర్శిస్తామని స్పష్టంచేశారు. ఉమ్మడి జిల్లాలోని బీఆర్‌ఎస్ నాయకత్వమంతా కేసీఆర్ కట్టించిన రిజర్వాయర్లు, పంపుహౌజ్‌లను ప్రజలకు చూపిస్తామన్నారు. ఈ యాత్ర ద్వారా ముఖ్యమంత్రి కొడంగల్ ప్రాజెక్టుకు పైసలు ఖర్చు చేస్తూ.. పాలమూరు ఎత్తిపోతల పనులను ఎలా ఎండబెడుతున్నాడో ప్రజలకు వివరంగా తెలియజేస్తామని హెచ్చరించారు. భూములు ఇచ్చి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించిన రైతులు, ప్రజలకు చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు చెప్పారు.

## లక్ష్మారెడ్డికి కేటీఆర్ పరామర్శ



ఆవంచలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, అతడి కుమారుడిని ఓదార్చుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 14 : సతీమణిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. మండలంలోని ఆవంచలోని ఆయన స్వగృహానికి శనివారం మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో చేరుకొన్న ఆయన లక్ష్మారెడ్డిని ఓదార్చారు. శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన్ను హత్తుకుని ధైర్యంగా ఉండాలని సూచించారు. మృధుస్వభావి లక్ష్మారెడ్డికి భార్య వియోగం బాధాకరమన్నారు. లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు, కుమారుడు, కుమార్తెతో మాట్లాడారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్, అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, బాల్కసుమన్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గణేశ్‌గుప్తా వచ్చి పరామర్శించారు. అంతకు ముందు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డితో పాటు జడ్చర్ల, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని కలిసి సంతాపం తెలియజేశారు.





శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నేతలు



కోస్గిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

# ఎమ్మెల్యే ఇంటిపై దాడి అప్రజాస్వామికం

- కొడంగల్‌లో ఫార్మా కంపెనీని అడ్డుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే పట్నం

కోస్గి, సెప్టెంబర్ 14 : ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై రౌడీలతో కలిసి ఎమ్మెల్యే గాంధీ చేయడం అప్రజాస్వామికమని, దీన్ని అందరూ ఖండించాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కోస్గి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి కాంగ్రెస్ బీ-ఫాంపై గెలవాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ అక్రమ అరెస్టులకు ఎవరూ భయపడరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీన రాష్ట్రంలో రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రూ.46వేల కోట్లలో కేవలం రూ.17వేల కోట్లతో 30శాతం మంది రైతులకు రుణమాఫీ చేశారని ఎద్దేవా చేశారు. కొడంగల్‌లో కూడా 30శాతం మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. రైతులకు ఇప్పటి వరకు రైతు భరోసా అందించలేదన్నారు. కోస్గి పట్టణంలో గతంలో రూ.8కోట్లతో సయ్యద్ పహాడ్ నుంచి ఏబీకే ఫంక్షన్ హాల్ వరకు డబుల్ లేన్ రోడ్డును కొంత పూర్తి చేశాయగా ప్రస్తుత ప్రభుత్వం దాన్ని ఇంకా పూర్తి చేయలేదన్నారు. గతంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.70కోట్లు మంజూరు చేయిస్తే వాటికి ఇప్పుడు కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేస్తున్నారన్నారు. రైతు భరోసాను పక్కదారి పట్టించడానికి హైడ్రా డ్రామా ఆడుతున్నారని, ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తారన్నారు.

### ఫార్మాసిటీని కొడంగల్‌కు రానివ్వం..

నియోజకవర్గంలో ఏర్పాటు చేసే ఫార్మా కంపెనీని అడ్డుకొని తీరుతామని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఏడు గ్రామాల పరిధిలో వేల ఎకరాల్లో ఫార్మాసిటీని నిర్మిస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌ను సూటి ప్రశ్న అడుగుతున్నా.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలో 13 వేల ఎకరాలను కేటాయించిందని గుర్తు చేశారు. సిద్ధంగా ఉన్న స్థలంలో ఫార్మా ఏర్పాటు చేయకుండా కొడంగల్‌కు ఎందుకిచ్చారో చెప్పాలని నిలదీశారు. ఇప్పటికే స్థానిక రైతులు ఈ కంపెనీ రాకను వ్యతిరేకిస్తున్నారన్నారు. కోస్గి పట్టణం సమీపంలో పొల్యూషన్ కంపెనీలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. అంతకుముందు కోస్గి బీసీ, శాసం కాలనీ, బహార్‌పేట్, బ్రాహ్మణ్ వీధిలో ఏర్పాటు చేసిన గణనాథులకు పూజలు చేశారు. వెంట బీఆర్‌ఎస్ నాయకులు శాసం రామకృష్ణ, వెంకట్ నర్సింహులు, కోట్ల మైపా ల్, విష్ణువర్ధన్‌రెడ్డి, మాధుయాదవ్, సాయిరెడ్డి, బెజ్జు న ర్సింహులు , సురేశ్ పాల్గొన్నారు.



జిల్లాలో రైతులు సాగు చేసిన పత్తి, వేరుశనగ పంట

# అయోమయం.. గందరగోళం!

- రుణమాఫీ వర్తించక.. రైతు భరోసా అందక ఇక్కట్లు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ప్రకటనతో రైతుల్లో ఆందోళన
- అందరికీ పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్
- ఇవ్వలేకనే సబ్‌కమిటీ పేరుతో కాలయాపన
- ఆగమ్యగోచరంలో కర్షకులు

గద్వాల, సెప్టెంబర్ 14 : జిల్లాలోని రైతులకు కష్టాలు, కన్నీటి బాధలు తప్పడం లేదు. అటు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాక, ఇటు వానకాలం సాగుకు పెట్టుబడి సాయం అందక రైతుల పరిస్థితి

ఆగమ్య గోచరంగా మారింది. దీనికి తోడు శుక్రవారం అలంపూర్ చౌరస్తాలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణస్వీకారానికి హాజరైన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు భరోసా, రుణమాఫీ పై చేసిన కీలక ప్రకటనలు రైతులకు పుండు మీద కారం చల్లినట్లు అయింది. వానకాలం సీజన్ మరో 20 రోజుల్లో ముగుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతు భరోసాపై ఎటువంటి నిర్ణయం తీసుకపోవడంతో రైతులు భగ్గుమంటున్నారు. రైతుల బాధలు తెలిసిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సీజన్ ప్రారంభం కాగానే రైతుల ఖాతాల్లో నగదు జమచేసేవారు. ప్రస్తుత కాంగ్రెస్ వానకాలం సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం ఆసాముల వద్ద అప్పులు చేసి పంటలను సాగు చేసుస్తున్నారు. రైతుభరోసా, రుణమాఫీ విషయంలో రైతులు ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నారు. సీఎం రేవంత్, మంత్రి తుమ్మల తీరు అధికారంలోకి రాక ముందు ఒకలా వచ్చాక మరొకలా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా అర్హత కలిగిన రైతులకు రుణమాఫీ చేయడంతోపాటు ఆగస్టు నాటికి వానకాలం సాగుకు సంబంధించి రైతు బంధు నిధులు రైతుల ఖాతాలో జమ చేయడంతో రైతులు సంబురంగా సాగు పనులు చేసుకునేవారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు దాటినా ఇంత వరకు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. దీనికి తోడు మంత్రి అలంపూర్‌లో కీలక ప్రకటన చేశారు. పంట పెట్టుబడి సాయం సాగు చేసిన భూములకే ఇస్తామని స్పష్టం చేయడంతో మంత్రి తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి పరిస్థితులు అనుకూలించక రైతులు తమ పొలాలను పూర్తి స్థాయిలో సాగు చేయలేకపోతున్నారు. అటువంటి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.


### రుణమాఫీ కాక.. రైతు భరోసా అందక ఇక్కట్లు

జిల్లాలోని రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాకపోవడంతోపాటు రైతు భరోసా రాకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో మూడువిడతల్లో 95,199మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా ప్రస్తుతం 51,188మంది రైతులకు రూ.440.7కోట్లు మాత్రమే ప్రభుత్వం రుణమాఫీ చేసింది. ఇంకా 44,011మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉంది. అయితే బ్యాంకు అధికారుల పొరపాట్ల వల్ల కూడా కొంతమంది రుణమాఫీ వర్తించలేదు. రైతులు రెండులక్షల లోపు రుణాలు తీసుకొని వడ్డీ కట్టి రెన్యువల్ చేసుకున్నా.. వడ్డీని రుణమాఫీలో చూయించకపోవడంతో ఆ రైతులకు రుణమాఫీ వర్తించడంలేదు. దీనికి తోడు రూ.2లక్షలకు పైగా రుణం ఉన్న రైతులు రెండు లక్షలకు పైగా ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే రుణమాఫీ చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి చెబుతున్నారు. ప్రస్తుతం రైతులు సాగుకే పెట్టుబడి కోసం దళారులను ఆశ్రయిస్తే రెండులక్షలకు పైగా ఉన్న నగదు ఎలా చెల్లించాలో రైతులకు అర్థం కావడం లేదు. 2023-2024 వానకాలం సీజన్‌లో 1,52,147మంది ఖాతాల్లో కేసీఆర్ ప్రభుత్వం రూ. 161.23 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. ప్రస్తుతం పెరిగిన రైతులతో కలుపుకొని ఈ వానకాలం సీజన్‌లో 1,76,181 మంది (గత ప్రభుత్వం రూ.5వేలు)రైతులకు రూ.232 కోట్ల నిధులు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమచేయాల్సి ఉండగా ఇప్పటి వరకు జమ చేయలేదు. పాత రైతు బంధు, కొత్త రైతు భరోసా ఏది రైతులకు ఇవ్వలేదు. దీనికి తోడు సబ్ కమిటీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో రైతులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అయిజ రైతువేదిక వద్ద రుణమాఫీ కోసం రైతుల నిరసన (ఫైల్)

### కాంగ్రెస్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతులందరికి రైతు భరోసా ఇస్తామని చెప్పింది. ఎన్నికల్లో గెలిచిన తర్వాత రైతు భరోసా ఇవ్వలేక కాలయాపన చేస్తుంది. రైతుల అభిప్రాయ సేకరణ అంటూ కొన్ని రోజులు, సబ్‌కమిటీ అంటూ మరికొన్ని రోజులుగా కాలయాపన చేసింది. ప్రస్తుతం వానకాలం సీజన్ ఈనెలతో ముగుస్తుంది ఇంకేప్పుడు రైతు భరోసా ఇస్తారు. రైతుబంధు విషయంలో కేసీఆర్ ప్రభుత్వమే మేలు. గతంలో ఉన్న రైతు బంధుకు దిక్కులేక పోగా పెంచిన రైతు భరోసా యాడిస్తరు. దీనికి తోడు రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తామన్నారు. యాడిస్తుండ్రు, సీఎం, మంత్రులు మాటలు చెప్పుడు తప్పా చేతల్లో చేసి చూయించడం లేదు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు చెప్పింది ఒకటి ప్రస్తుతం చేస్తున్నది మరొకటి. రైతులకుఎటువంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ వెంటనే పెంచిన రైతు భరోసా ఇవ్వాలి.

- వీరశేఖర్, అయిజ, జోగులాంబ గద్వాల జిల్లా

### షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి



రైతులకు ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి. ఎన్నికల మ్యానిఫెస్టోలో అందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట తప్పింది. రెండు లక్షలకు పైగా ఉన్న రైతులు ముందుగా ఎక్కువగా ఉన్న డబ్బులు చెల్లించాలని ఆ తర్వాత ప్రభుత్వం రూ.2లక్షలు జమ చేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి అలంపూర్‌లో ప్రకటించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ప్రభుత్వం రెండు లక్షలు మాఫీ చేస్తే పైగా ఉన్నది తిరిగి రుణం తీసుకున్న తర్వాత రైతులు చెల్లిస్తారు. ఇటు రైతులకు రైతు భరోసా ఇవ్వక, రుణమాఫీ చేయక ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతుంది. ఎన్నికల సమయంలో ఇలా చెప్పలేదు. రుణమాఫీపై ముఖ్యమంత్రిది ఓ మాట మంత్రులది మరోమాట. వారిలో వారికే స్పష్టతలేదు. ఇక పాలన ఏమి చేస్తారు.

- రాముడు,చండూర్, మానవపాడ్ మండలం , జోగులాంబ గద్వాల జిల్లా

# విద్యార్థిని చితకబాదిన ప్రిన్సిపాల్

- తీవ్రంగా గాయపడిన విద్యార్థి
- బిజినేపల్లి మండలం గౌరారంలో ఘటన

బిజినేపల్లి, సెప్టెంబర్ 14: పాఠశాలకు ఆలస్యంగా వచ్చాడన్న నెపంతో ఓ విద్యార్థిని ప్రిన్సిపాల్ కర్రతో చితకబాదిన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకున్నది. విద్యార్థి తల్లిదండ్రులు కథనం ప్రకారం..

మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సురేందర్ బిజినేపల్లిలోని మేధాంస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం పాఠశాలకు పది నిమిషాలు ఆలస్యంగా వచ్చాడన్న కారణంగా సురేందర్‌ను ప్రిన్సిపాల్ రమేశ్ కర్రతో తీవ్రంగా కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గాయాలు తాళలేక విద్యార్థి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడని, విషయం తెలుసుకున్న స్నేహితులు బైక్‌పై గౌరారం గ్రామానికి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. తీవ్ర గాయాలతో వణుకుతున్న విద్యార్థి ఒంటిపై గాయాలు చూసి తల్లిదండ్రులు ఆగ్రహానికి గురయ్యారు. అకారణంగా తమ కుమారుడిని తీవ్రంగా కొట్టిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈమేరకు ఎంఈవోలు, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.



తీవ్రంగా గాయపడిన విద్యార్థి సురేందర్



జూరాల నుంచి దిగువకు పరుగులు పెడుతున్న వరద


- నిండుకుండలా ప్రాజెక్టులు
- జూరాల ప్రాజెక్టు 4 గేట్ల ద్వారా దిగువకు
- ఇన్‌ఫ్లో 52,800 క్యూసెక్కులు.. అవుట్‌ఫ్లో 58,435 క్యూసెక్కులు

# కృష్ణా, తుంగభద్రకు తగ్గిన వరద

గద్వాల, సెప్టెంబర్ 14 : జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గింది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 52,800 కూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. దీంతో జూరాల ప్రాజెక్టు 4గేట్లు ఎత్తి దిగువకు 58,435 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి స్థాయి నీటిమట్టం 318.516మీటర్లు కాగా ప్రస్తుతం 318.240 మీటర్లు గా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటినిల్వ 9.070 గా ఉంది. జూరాల ఎడమ కాల్వకు 730, కుడి కాల్వకు 630, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 750, భీమా లిఫ్ట్-2కు 750, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుండగా విద్యుదుత్పత్తికి 38,849 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టుకు మొత్తం అవుట్ ఫ్లో 58,435 క్యూస్కెలు వరద వచ్చి చేరుతుండగా వాటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

### ఆల్మట్టి, నారాయణపుర డ్యాంలకు..

అయిజ, సెప్టెంబర్ 14 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. శనివారం ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 32,690 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 28,628 క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు గరిష్టస్థాయి నీటి మట్టం 1705 అడుగులకు గాను 1704.69 అడుగులు ఉంది. పూర్తిస్థాయి గరిష్ట నీటి మట్టం 129.72 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 128.01 టీఎంసీల నిల్వ ఉంది. నారాయణపుర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 29,189 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 26,318 క్యూసెక్కులు ఉంది. గరిష్ట స్థాయి నీటి మట్టం 1615 అడుగులకు గానూ ప్రస్తుతం 1614.76 అడుగులు ఉన్నది. పూర్తి స్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 37.46 టీఎంసీలు ఉన్నది.



ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద

### ఆర్డీఎస్ ఆనకట్టకు

కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు టీబీ డ్యాంకు వరద కొనసాగుతున్నది. శనివారం తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 21,950 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 21,356 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 101.656 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల నీటి మట్టానికి గాను, 1631.97 అడుగులు ఉన్నది. అలాగే ఆర్డీఎస్ ఆనకట్టకు 20,631 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 20,000 క్యూసెక్కుల వరద నీరు సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 631 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 9.7 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నది.



తుంగభద్ర డ్యాం వద్ద నీటిమట్టం